సాక్షి ఒడిశా

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,36,757లు, బంగారం 4 గ్రాము 250 మిల్లీగ్రాము, వెండి 42గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అభివృద్ధి పనుల పరిశీలన

రాయగడలో అభివృద్ధి పనులను అధికారులు పరిశీలించారు. పనులపై ఆరా తీశారు.

- 8లో



ఘనంగా నందోత్సవాలు

బొరిగుమ్మలో నందోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలు వంశపారంపర్యంగా జరుగుతున్నాయి.

- 8లో

అమిత్ షాతో.. రాష్ట్ర బీజేపీ చీఫ్ సమావేశం

భువనేశ్వర్:

రాష్ట్ర భారతీయ జనతా పార్టీ చీఫ్ మన్మోహన్ సామల్ సోమవారం న్యూ ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. దీన్ని మర్యాదపూర్వక సమావేశంగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర అగ్ర శ్రేణి నాయకులు తరచూ సమావేశం అవుతుండడంపై సర్వత్రా ఉత్కంఠ బిగుసుకుంటోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ కలయికలు, సమావేశాలు, చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ నెల ప్రారంభంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ న్యూ ఢిల్లీలో అమిత్ షాను కలిశారు. గత వారం అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జె. పి. నడ్డాతో కలిసి వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా ఒడిశా అగ్ర శ్రేణి నాయకత్వంతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో రాష్ట్రంలో తొలి సారిగా ఏర్పాటైన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్నా మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ జరగలేదు. మరో వైపు కీలకమైన రాష్ట్ర కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల అధిపతుల పేర్లను ఖరారు చేయడంపై ఊహాగానాల నేపథ్యంలో ఉభయ రాష్ట్ర, కేంద్ర నాయకుల సమావేశాలు చర్చనీయాంశమవుతున్నాయి. కేంద్ర హోం శాఖ మంత్రితో సోమవారం జరిగిన చర్చలకు సంబంధించి కచ్చితమైన వివరాలు వెల్లడి కాలేదు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, రాష్ట్రంలో బీజేపీ సంస్థాగత సామర్థ్యం బలోపేతం, రాష్ట్ర, జాతీయ ప్రాధాన్యతల సమన్వయంతో సమగ్ర పురోగతి అంశాలపై చర్చ కొనసాగినట్లు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఒక సందేశం జారీ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి లక్ష్యంగా వికసిత భారత్ సంకల్పం సాకారం చేయడంలో ఒడిశా కీలక పాత్రపై ప్రధాన చర్చ జరిగింది. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి మన్మోహన్ సామల్ వ్యూహాత్మక మార్గదర్శకత్వం పట్ల అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.



అమిత్ షాతో రాష్ట్ర బీజేపీ చీఫ్ మన్మోహన్ సామల్ సమావేశం



కేంద్ర హోం శాఖ మంత్రిని కలిసిన మన్మోహన్ సామల్

రైలు పట్టాలపై సౌర విద్యుత్ ఉత్పాదన



సౌర శక్తి పలకలతో రైలు పట్టాల మార్గం



సౌర శక్తి పలకల అమరిక పట్టాల మార్గంలో పరుగులు తీస్తున్న రైలు

- భారతీయ రైల్వే వినూత్న కృషి

భువనేశ్వర్: ప్రయాణికులు, సరుకు రవాణాలో సాటి లేని మేటి సంస్థగా వెలుగొందుతున్న భారతీయ రైల్వే బహుముఖ లాభసాటి చర్యలతో మరింత ఎదగాలనే దృక్పథాన్ని బలపరచుకుంటోంది. ప్రయాణికుల పాసింజరు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సరుకు రవాణా (గూడ్సు) రైళ్లు శరవేగంతో దూసుకుపోయేందుకు ఆధారంగా నిలిచే పట్టాల వినియోగాన్ని మరింత సఫలీకృతం చేసే దిశలో రైల్వే శాఖ వినూత్న ప్రయోగానికి సాహసించింది. రైలు పట్టాల మధ్య విస్తరించిన సుదూర పొడుగాటి స్థలంలో సౌర శక్తి ఉత్పాదన కోసం సంకల్పించింది. ఈ స్థలంలో సౌర శక్తి పలకలు (సోలార్ ప్యానెల్) వైజ్ఞానికతో కూడిన సాంకేతిక అమరికతో సౌర శక్తి ఉత్పాదన సుసాధ్యమేనని నిర్ధారించింది. భారత దేశంలో తొలి సారిగా వారణాసిలోని బెనారస్ లోకో మోటివ్ వర్క్స్ (బీఎల్‌డబ్ల్యూ) ఈ ప్రయోగానికి ముందడుగు వేసింది.

సౌర శక్తి ఉత్పాదన అంచనా

రైళ్లు పరుగులు తీస్తున్న పట్టాల మధ్య ఖాళీ స్థల భాగంలో క్లీన్ అండ్ గ్రీన్ ప్రామాణికంగా సౌర శక్తి పలకల అమరికతో హరిత విద్యుత్ ఉత్పాదన సాధ్యాసాధ్యాల కార్యాచరణ మొదలైంది. అధికారుల అంచనా ప్రకారం 70 మీటర్ల రైలు మార్గం (ట్రాక్) వెంబడి 28 సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుతో 15 కిలో వాట్‌ల పీక్ పవర్ ఉత్పత్తి సాధ్యమని భావిస్తున్నారు. ఈ ఏర్పాటుతో పర్యావరణ కాలుష్యం తలెత్తకుండా సరళమైన నిర్వహణ, పరిరక్షణ అంశాల్ని పరిగణనలోకి తీసుకుని భారతీయ రైల్వే శాఖ ఆచి తూచి అడుగు వేస్తుంది. సాధారణ నిర్వహణ కార్యకలాపాలు, వర్షాలు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో పట్టాల మధ్య అమర్చిన సౌర శక్తి ఉత్పాదక పలకల తొలగింపు, పునరుద్ధరణ ఈ వ్యవస్థలో సానుకూల చొరవ. భారతీయ రైల్వే సంకల్ప సిద్ధితో దేశంలో సౌర శక్తి ఉత్పాదన గణనీయంగా పుంజుకునే అవకాశాల పట్ల సర్వత్రా ఆశాభావం వ్యక్తం అవుతుంది

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రిని కలిసిన బ్యాడ్మింటన్ అక్కాచెల్లెళ్లు



బ్యాడ్మింటన్ అక్కాచెల్లెళ్లను అభినందించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: ప్యారిస్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు భారత దేశానికి ప్రాతినిథ్యం వహిస్తున్న బ్యాడ్మింటన్ అక్కాచెల్లెళ్లు రుతుపూర్ణ పండా, శ్వేతపూర్ణ పండా సోమవారం స్థానిక లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని కలిశారు. వీరివురు భారత దేశ తొలి తోబుట్టువుల బ్యాడ్మింటన్ క్రీడాకారిణులుగా పేరొందారు. ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న ప్రతిష్టాత్మక ప్యారిస్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రపంచ వేదికపై వారు అద్భుతమైన విజయాన్ని సాధించగల సామర్థ్యంపై నమ్మకం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి హృదయపూర్వకంగా బ్యాడ్మింటన్ అక్కాచెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇరువర్గాల కొట్లాటలో ఇద్దరు అరెస్టు





అరెస్టయిన అజయ హరిజన్, చందన హరిజన్

జయపురం: జయపురం సమితి ఘివురి గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో మరో ఇరువురిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ సచీంద్ర ప్రధాన్ సోమవారం తెలిపారు. జూలై 31వ తేదీన ఘివురి గ్రామ కూడలి వద్ద కొంతమంది యువకులు మాట్లాడుతుండగా వారిమధ్య వివాదం తలెత్తి కొట్లాటకు దారితీసింది. ఈ సంఘటనలో పలువురు గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే సదర్ పోలీసు స్టేషన్ పరిధి గగణాపూర్ పోలీసు పంటి అధికారి చిత్తరంజన్ ప్రదాన్ తన సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకొని ఉభయ వర్గాల వారిని శాంత పరచి గాయపడిన వారిని జయపురం జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో చేర్చారు. వారిలో ఎనిమిది మందిని ప్రాథమిక చికిత్స తరువాత విడిచి పెట్టామని తెలిపారు. ఇద్దరికి తీవ్రంగా గాయాలు కావటంతో వారిని కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల హాస్పిటల్‌కు తరలించారు. కొట్లాటలో నిందితులైన వారిలో ఇద్దరిని ఆదివారం అరెస్టు చేశామన్నారు. అరెస్టయిన వారిలో ఘివురి గ్రామానికి చెందిన చందన హరిజన్, అజయ హరిజన్ ఉన్నారన్నారు. వారిని కోర్టులో హాజరుపరచినట్లు వెల్లడించారు.

పుట్టగొడుగులు తిని ఎనిమిది మందికి అస్వస్థత

- రామగిరిలో ఘటన..



ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్ రామగిరి పోలీసుస్టేషన్ పరిధిలో విషాద సంఘటన జరిగింది. రామగిరి పంచాయతీ దెవురి సాహి గ్రామంలో సోమనాథ బెహెరా అడవిలో దొరికిన విషపు పుట్టగొడుగులు తిని వారి కుటుంబంలో ఎనిమిది మంది అస్వస్థతకు గురయ్యారు. తొలుత క్షతగాత్రులను రామగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్చిన తరువాత మెరుగైన చికిత్స కోసం చంద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం దెవురిసామి గ్రామంలో సోమనాథ బెహెరా ఆవులు దొంగలాడటానికి వెళ్లి అడవిలో దొరికిన పుట్టగొడుగులు సేకరించి ఇంటికి తీసుకొచ్చారు. కుటుంబసభ్యులు వండి తన అన్న కుటుంబానికి కూడా కూరను ఇచ్చాడు. పుట్టగొడుగులు కూర తిన్న రెండు కుటుంబ సభ్యులకు గొంతుకలో దురద ఏర్పడి తరువాత అస్వస్థత గురై అచేతనంగా పడిపోయారు. అంబులెన్సులో చంద్రగిరి సీహెచ్‌సీకి క్షతగాత్రులను తరలించారు. చికిత్స పొందిన తరువాత వారి ఆరోగ్యం కుదుట పడిందని డాక్టర్లు తెలియజేశారు.

సృజనాత్మక సంస్కరణలకు ప్రోత్సాహం

- పౌర సేవలు ప్రజలకు అందేలా చర్యలు
- చొరవ తీసుకుంటున్న ముఖ్యమంత్రి మోహన్

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వ సేవల్ని ప్రజలకు సకాలంలో అక్కరకు వచ్చే రీతిలో ఉండాలని ఆరాటపడుతున్నారు. తొలి సంస్కరణగా క్రమం తప్పకుండా తరచు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రజా ఫిర్యాదుల శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రజాభియోగాలు, ఫిర్యాదులకు కళ్లెం వేసే దిశలో పాలన సంస్కరణలు చేపట్టేందుకు మోహన్ సర్కారు మరో ముందడుగు వేసింది. దైనందిన విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పని చేసేలా చొరవ కల్పించింది. ప్రభుత్వ సిబ్బంది ప్రస్తుత దైనందిన కార్యశైలిని పూర్తి స్థాయిలో సంస్కరించేందుకు నడుం బిగించింది. పారదర్శక సమన్వయం, నిబద్ధత ప్రామాణికంగా ఈ చొరవకు శ్రీకారం చుట్టడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం ఆధ్వర్యంలో సిబ్బంది, అధికారుల భాగస్వామ్యంతో సంస్కరణ ప్రతిపాదనలకు ప్రోత్సహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మనోగతాల్ని పరిగణనలోకి తీసుకుని దీర్ఘకాలంగా పేరుకుపోయిన ఇబ్బందికర పరిస్థితులు నివారించాలని నిర్ణయించడం విశేషం. ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా విధి నిర్వహణ కార్యశైలిలో భారీ సంస్కరణలు అనివార్యంగా ప్రభుత్వం గుర్తించింది. సిబ్బంది సహకార, సమన్వయంతో భాగస్వామ్య పాలన ప్రోత్సాహానికి సెంటర్ ఫర్ మోడరైజింగ్ గవర్నమెంట్ ఇనిషియేటివ్ (సీఎంజీఐ) రూపొందించిన ఈ-పోర్టల్ అనుసంధానంతో డిజిటల్ వేదిక ఏర్పాటు చేసింది. హెచ్‌ఆర్‌ఎంఎస్ ఐడీ కలిగిన ప్రభుత్వ సిబ్బంది ఈ వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ విధుల నిర్వహణలో చేపట్టాల్సిన సంస్కరణలకు సలహాలు, సూచనలు, ప్రతిపాదనలు దాఖలు చేసేందుకు వీలు కల్పించింది. ఈ ప్రక్రియ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది మధ్య పరిమితం. సంస్కరణల దిశలో ప్రతిపాదనలపట్ల తోటి సిబ్బంది ప్రతిస్పందిస్తారు. వారి ప్రతిస్పందన ప్రామాణికంగా ప్రతిపాదనల అమలు కోసం మలి దశ విశ్లేషణకు సిఫారసు చేసి అభిప్రాయ సేకరణ ఖరారు చేస్తారు. తోటి సిబ్బంది లైక్‌లు, డిస్‌లైక్‌లు ద్వారా తమ అభిప్రాయాలతో ప్రతిస్పందిస్తారు.

అత్యధిక లైక్‌లు కొలమానం

అత్యధిక ఆదరణ (లైక్) పొందిన అధికారిక పాలనాపరమైన సంస్కరణ ప్రతిపాదనలు, సూచనల్ని వాస్తవ కార్యాచరణకు సిఫారసు చేస్తారు. ప్రాథమికంగా ప్రభుత్వ సిబ్బంది 1,000 పైబడిన లైక్‌లను సంస్కరణ ప్రామాణికంగా పరిగణిస్తారు. ఈ ప్రతిపాదనల వాస్తవ కార్యాచరణలో బాగోగులు సమీక్షించేందుకు సంబంధిత విభాగాలకు సిఫారసు చేస్తారు. ప్రతి విభాగం సాధ్యాసాధ్యాలు, సుస్థిరత, తదనంతర పరిణామాల్ని సీనియర్ అధికారులు మూల్యాంకన చేస్తారు. ఈ ప్రక్రియ కోసం సంయుక్త కార్యదర్శి హోదా కలిగిన ఉన్నతాధికారిని నోడల్ అధికారిగా నియమిస్తారు. నోడల్ అధికారి ఆధ్వర్యంలో సూచన మూల్యాంకన కమిటీ ఏర్పాటవుతుంది. సిబ్బంది ఆలోచనలు, సలహాలు, సూచనల్ని ఈ కమిటీ లోతుగా సమీక్షించేందుకు అనుబంధ వర్గాలతో సంప్రదించి ప్రతిపాదనల ఆమోదం ఖరారు చేస్తుంది. బహుళ ప్రయోజనకారిగా ఎంపికైన ప్రతిపాదనల్ని అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాల దైనందినక కార్యకలాపాల్లో సంస్కరణ మార్గదర్శకంగా ప్రయోగిస్తారు. పరిమిత ప్రయోజనకరంగా ఉన్న ప్రతిపాదనల్ని ఉన్నతాధికారుల సంప్రదింపుల మేరకు సంబంధిత విభాగం కార్యకలాపాల సంస్కరణకు పరిమితం చేయనున్నారు. ఉన్నత ప్రతిపాదనలకు ప్రోత్సాహకర బహుమతులు ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం నోడల్ అథారిటీగా వ్యవహరిస్తుంది. సెంటర్ ఫర్ మోడరైజింగ్ గవర్నమెంట్ ఇనిషియేటివ్ సాంకేతిక మద్దతు, శిక్షణ మరియు హెల్ప్‌డెస్క్ సేవలను అందిస్తుంది. ప్రభుత్వ విభాగాలు నోడల్ అధికారులను నామినేట్ చేసి తదనంతరం కమిటీలను ఏర్పాటు చేసేందుకు 15 రోజుల గడువుతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తర్వుల ప్రకారం సిబ్బంది భాగస్వామ్యాన్ని చురుకుగా ప్రోత్సహించాలని స్పష్టంగా ఆదేశించడం విశేషం.

దివ్యాంగురాలిని మోసగించిన వ్యక్తి అరెస్టు



అరెస్టయిన నగేష్ ధను

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి గగుడి గుమ్మ గ్రామంలో దివ్యాంగురాలని మోసగించిన కేసులో అదే గ్రామానికి చెందిన యువకుడు నగేష్ ధనును పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నగేష్ దివ్యాంగురాలైన యువతిని ప్రేమించి పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. నిజమని నమ్మిన ఆమె శారీరకంగా అతనికి దగ్గరైంది. దీంతో గర్భవతయ్యింది. తొమ్మిది నెలల నిండిన అనంతరం ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. గ్రామస్తుల సమక్షంలో తానే ఆ శిశువుకు తండ్రినని నగేష్ అంగీకరించాడు. కొద్దిరోజులు గడిచిన తరువాత తనను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. దీంతో యువతితోపాటు ఆమె తల్లిదండ్రులు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం నగేష్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

చోరీ కేసులో బాలుడితోపాటు ఇద్దరు అరెస్టు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసులు ఒక దొంగతనం కేసులో బాలుడితోపాటు ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి కేసు దర్యాప్తు అధికారి దీరేంద్ర బారిక్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బొయిపరిగుడ నివాసి బి.భాస్కరరావు వివపి కాలనీలో సొంతిల్లు కడుతూ జయపురంలో ఉంటున్నారు. ఈ నెల 8 వ తేదీన ఇంటిని చూసేందుకు జయపురం నుంచి బొయిపరిగుడ వచ్చారు. అయితే ఇంటి నిర్మాణానికి వినియోగించే మూడు వాటర్ పంపు మోటార్లు, మూడు ఇనుప రాడ్ల బండిళ్లతో పాటు కొన్ని సామాన్లు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బొయిపరిగుడ సమితి పల్లిగుడ గ్రామంలో ఇద్దరిని అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో దొంగతనం చేసినట్లు వారు అంగీకరించారు. వారిలో ఒకరు బాలుడు కాగా మరొకడు పల్లిగుడ వాసి ధీనబంధు బాగధెరియ (27) అని పోలీసు అధికారి వెల్లడించారు. బాలుడి ఇంటిలో రెండు వాటర్ పంపు మోటారులు, కొన్ని ఇనుప రాడ్ల బండిళ్లు స్వాధీన పరచుకున్నట్లు వెల్లడించారు.

మల్కన్‌గిరిలో భారీ వర్షం



ఎంవీ 96 వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు



కంగురుకొండ వంతెన వద్దకు వెళ్లి ప్రజలతో చర్చిస్తున్న మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి

మల్కన్‌గిరి : మల్కన్‌గిరిలో భారీ వర్షాలు పడుతున్నాయి. కలిమెల సమితి ఎంవీ 96 వంతెనపై 5 అడుగులు నీరు ప్రవహించడంతో మల్కన్‌గిరి-కలిమెల రహదారి పూర్తిగా నిలిచిపోయింది. కంగురుకొండ వద్ద కూడా వర్షం నీరు నిండి రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సోమవారం జిల్లా అంతటా రెడ్ అలర్ట్ ప్రకటించింది.

మోహనలో కుండపోత

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గత మూడు రోజులుగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ఆదివారం నుంచి మోహన బ్లాక్‌లో కుండపోత కురుస్తోంది. దీని ప్రభావంతో శిరిసిపడ, తియ్యమా వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో నాలుగు గ్రామాలకు రవాణా, కమ్యూనికేషన్లు ఆగిపోయాయి. మోహనలో అత్యధికంగా 123.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఆర్.ఉదయగిరిలో 45.0 మిల్లీమీటర్లు, గుసానిలో 71.0, కాశీనగర్‌లో 11.8, పర్లాకిమిడిలో 28.0, రాయగడ బ్లాక్‌లో 22.4, గుమ్మాలో 34.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



రహదారిపై ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మల్కన్‌గిరి మెయిన్ రోడ్డులో దుకాణంలోకి చేరిన వర్షం నీరు



పర్లాకిమిడిలో కురుస్తున్న కుండపోత వర్షం



మోహనా బ్లాక్‌లో శిరిసిపడ వద్ద విరిగిపడ్డ కొండ చరియలు



పర్లాకిమిడిలో ఉదయం నుంచి కురుస్తున్న కుండపోత వర్షం

మల్కన్‌గిరిలో ముఖ్యమంత్రి వాయు ఆరోగ్య సేవా శిబిరం



మల్కన్‌గిరికి బయల్దేరిన ముఖ్యమంత్రి వాయు ఆరోగ్య సేవా నిపుణుల బృందం

భువనేశ్వర్: రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల ప్రజలకు ముఖ్యమంత్రి వాయు ఆరోగ్య సేవా యోజన కింద ప్రత్యేక వైద్య సేవలు కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా మల్కన్‌గిరి జిల్లా ప్రజలకు అధిక నాణ్యత ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు కటక్ శ్రీ రామ చంద్ర భంజ్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి నుంచి వైద్య నిపుణుల బృందం సోమవారం మల్కన్‌గిరి జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రికి బయల్దేరింది. ఈ వైద్య బృందంలో లాప్రోస్కోపీ శస్త్ర చికిత్స, నెఫ్రాలజీ, న్యూరాలజీ విభాగాలకు చెందిన నిపుణులు, సహాయకులు ఉన్నారు. ఈ బృందం 21వ తేదీ వరకు అక్కడే ఉండి ప్రత్యేక సేవలు, చికిత్సను అందిస్తుంది. మల్కన్‌గిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 250 మందికి పైగా రోగులు ఈ సేవ కోసం ముందస్తుగా నమోదు చేసుకున్నట్లు సమాచారం.

కల్యాణ సింగుపూర్‌లో రైతుల ఆందోళన



ల్యాంప్స్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్



ల్యాంప్స్ కార్యాలయానికి తాళం వేసేందుకు షట్టరు దించుతున్న రైతులు

రాయగడ: సకాలంలో ఎరువులు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కల్యాణసింగుపూర్‌లో గల ల్యాంప్స్ కార్యాలయానికి రైతులు తాళం వేశారు. ఎరువుల కోసం గంటల తరబడి ఎదురు చూసినా ల్యాంప్స్ అధికారులు పట్టించుకోవడం లేదని, ఎరువులను నల్ల బజారుకు తరలిస్తున్నారని ఆరోపించారు. సమితిలోని సుమారు 14 పంచాయతీలకు చెందిన వందలాది మంది రైతులు ఎరువుల కోసం ల్యాంప్స్ కార్యాలయం వద్ద పడిగాపులు కాసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం రహదారి వద్ద బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్, పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులను బుజ్జగించారు. రైతు గుడ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ఎరువుల పంపిణీ విషయంలో ల్యాంప్స్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని, సకాలంలో రైతులకు ఇవ్వాల్సిన ఎరువులను ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని అన్నారు.

క్లుప్తంగా

నవీన్ నివాస్‌లో కలుద్దాం



ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ స్వల్ప అస్వస్థతకు గురై స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఆయనను చూడటానికి వస్తున్న సందర్శకులకు ఆత్మీయ సందేశాన్ని సోమవారం ఆస్పత్రి నుంచే జారీ చేశారు. నన్ను కలవాలనుకుంటే, దయచేసి నవీన్ నివాస్‌కి రావాలన్నారు. తాను వైద్యుల సంరక్షణలో ఉన్నప్పుడు ప్రజలు ఆస్పత్రి సందర్శనకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజల మమతానురాగాలకు నవీన్ పట్నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

కూరగాయల వ్యాపారిపై ఫిర్యాదు



ఐఐసీ ప్రశాంత భూపతికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

పర్లాకిమిడి: గజపతి మార్కెట్‌లో కాయగూరల వ్యాపారి బల్ల మహేష్‌పై కాంగ్రెస్ నాయకుడు బసంత పండా, చిల్లర వ్యాపారులు ఆదర్శ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సంక్రాంతి నాడు మార్కెట్‌కు బంద్ సందర్భంగా కాయగూరల అమ్మకాలు మూసివేయించారన్నారు. చాలక రాజవీధి, మెడికల్ జంక్షన్, పాత కోర్టు జంక్షన్ వద్ద చిరు వ్యాపారులు, రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటున్న మహిళా వ్యాపారులపై దౌర్జన్యం చేశాడని, సంక్రాంతి నాడు కూరగాయాలు అమ్మకూడదని రోడ్డుపై విసిరేశాడన్నారు. ఐఐసీ ప్రశాంత్ భూపతిని బసంత్ పండా, లోకనాథ మిశ్రా, సూర్యనారాయణ పాత్రో సనోజ్ పట్నాయక్ కలిసి ఫిర్యాదు చేశారు. గజపతి మార్కెట్‌లో కొంతమంది గూండాయిజం చెలాయిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బసంత్ పండా కోరారు.

రిమ్స్‌లో యువకుడి అనుమానాస్పద మృతి



బాత్‌రూమ్ వద్ద జారిపడిన అక్కయ్య

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన మురపాక అక్కయ్య (30) పచ్చ కామెర్ల వ్యాధితో ఇటీవల చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. సోమవారం మధ్యాహ్నం ఎమర్జెన్సీ వార్డు సమీపంలో ఉన్న బాత్రూమ్ వైపు అక్కయ్య వెళ్లాడు. తిరిగి వస్తుండగా జారిపడి స్పృహ కోల్పోయాడు. అక్కడికి కొద్ది సమయంలోనే వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించినా మృతికి గల కారణాలు తెలియరాలేదు. రోగి కుటుంబ సభ్యులు బాత్రూమ్‌కు వెళ్లక ముందు బాగానే ఉన్నాడని, ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదని వాపోతున్నారు. ఇదే విషయమై అవుట్ పోస్టు పోలీసుల వద్ద మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా వైద్యులు సాధారణ మరణంగా ధ్రువీకరించి పంపించేశారన్నారు. బాత్రూమ్‌లో పడిపోవడం వాస్తవమేనని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాద స్థలంలో పవన్ కుమార్ మృతదేహం

రణస్థలం: లావేరు మండలంలోని తాళ్లవలస జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. లావేరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలో జలుమూరు మండలంలోని గోటివాడ గ్రామానికి చెందిన ముక్త పవన్ కుమార్ (25) విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గత రెండు రోజులు సెలవులు కావడంతో ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం తిరుగు ప్రయాణమయ్యాడు. జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 10 గంటల సమయంలో లావేరు మండలంలోని తాళ్లవలస వచ్చేసరికి ముందు వెళ్తున్న ఆటో సడన్‌గా రోడ్డుపై నీరు ఉందని తిప్పాడు. దీంతో ఆటోను తప్పించి అధిగమించే క్రమంలో వెనువెంటనే వెనుక వచ్చిన వ్యాను బలంగా ఢీకొట్టింది. దీంతో పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తండ్రి నరిసింగరావు, తల్లి ఉషారాణి, సోదరుడు సాయి ఉన్నారు. రోడ్డు ప్రమాదంపై లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వినతుల వెల్లువ



పర్లాకిమిడి: పింఛన్ కార్డులను అందజేస్తున్న కలెక్టర్



పర్లాకిమిడి: గ్రీవెన్స్ సెల్‌కు హాజరైన కలెక్టర్ మధుమిత, ఎస్పీ, సబ్ కలెక్టర్



రాయగడ: కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్ మంగరాజ్ పూర్‌లో గ్రామ ముఖి పరిపాలన, జాయింట్ గ్రీవెన్స్ సెల్‌కు జిల్లా కలెక్టర్ మధుమిత హాజరయ్యారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, డి.ఎఫ్.ఓ కె.నాగరాజు సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు పాల్గొన్నారు. మొత్తం 84 వినతులు అందయి. వాటిలో వ్యక్తిగతం 25, గ్రామ సమస్యలకు సంబంధించినవి 59 ఉన్నాయి. జిల్లా దివ్యాంగ సాధికారత అధికారి సంతోష్ నాయక్ పది మంది లబ్ధిదారులకు పింఛను కార్డులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఆర్.ఉదయగిరి పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శోబోరో, తహసీల్దార్ జ్యోతిమయ దాస్, బీడీఓ లారీమాన్ ఖర్సల్, జిల్లా ముఖ్యవైద్యాధికారి మహమ్మద్ ముబారక్ ఆలీ, సర్పంచ్‌లు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

చంద్రపూర్‌లో..

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి కార్యాలయంలో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వాతి.ఎస్.కుమార్, జిల్లా ముఖ్యవైద్యాధికారి సరోజిని దేవి, చంద్రపూర్ సమితి అధ్యక్షుడు కొయాన్ కింబక, తహసీల్దార్ సునీల్ కుమార్ ప్రధాన్, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు. సమితిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 39 సమస్యలు కలెక్టర్ దృష్టికి వచ్చాయి. సమితి పరిధిలోని ఎస్సీ, ఎస్టీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో వసతులను, మౌలిక సౌకర్యాలను మెరుగుపరచాలని కొంతమంది విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కలక్టర్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆసీమారావ్‌తో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఐదుగురుకి 51 వేల రుపాయలను రెడ్ క్రాస్ నిధుల నుంచి చికిత్స కోసం అందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గుణుపూర్‌లో పర్యటించి మహిళలతో మాట్లాడుతున్న గిరీష్

రాయగడ: రాష్ట్ర పంచాయతీ, నీటి పారుదల శాఖల కార్యదర్శి ఎస్.ఎన్.గిరీష్ జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో గల పద్మపూర్, గుణుపూర్ సమితుల్లో సోమవారం పర్యటించారు. ఆయా సమితుల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించారు. గుణుపూర్‌లో గల సబ్ డివిజన్ హాస్పిటల్‌ను పరిశీలించి రోగులతో మాట్లాడారు. హాస్పిటల్‌లో అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం సమితిలోని సానసారి, కులుసింగి గ్రామాల్లో పర్యటించారు. వికసిత్ ఒడిశా ద్వారా నిర్మిస్తున్న వివిధ అభివృద్ధి పనులను సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో ఈ పథకంలో నిర్మితమవుతున్న ఇళ్లను, లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. కులుసింగ్‌లో జరుగుతున్న ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని పర్యవేక్షించారు. గ్రామస్తులతో చర్చించారు. అనంతరం పుటాసింగిలో పర్యటించిన ఆయన ఎస్ఎస్‌డీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజన ఎలా ఉంది, సౌకర్యాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. సమితిలోని రైజింగ్ తల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారా అని అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ పర్యటనలో గుణుపూర్ సబ్ కలెక్టర్ దుధల్ దిలీప్ అభిషేక్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయకుమార్ ఖెముండొ పాల్గొన్నారు. కార్యదర్శి గిరీష్‌కు లంజియా సవర లిపికి సంబంధించిన పెయింటింగ్‌ను అధికారులు బహూకరించారు.

రెవెన్యూ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులపై చర్యకు డిమాండ్



మాట్లాడుతున్న శశిభూషణ దాస్ తదితరులు

జయపురం: కొరాపుట్ జిల్లా రెవెన్యూ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తుందని ఒడిశా అమలా సంఘ ఆఫీసర్స్ అసోసియేషన్ సాధారణ కార్యదర్శి శశిభూషణ దాస్ ఆరోపించారు. సోమవారం ఉదయం జయపురం బ్లాక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం కొరాపుట్ జిల్లా రెవెన్యూ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పిలవబడుతున్న వ్యక్తులు డి.ఎన్.కె సద్భావణ భవనం కొరాపుట్‌లో తమ డిమాండ్‌ను నెరవేర్చుకొనేందుకు ఒడిశా అమలా సంఘం పేరుని, బేనర్, రిజిస్ట్రేషన్ నంబర్‌ను లెటర్ పేడ్‌ను, బ్యానర్లను అక్రమంగా వినియోగించి సమావేశం నిర్వహించారని ఆరోపించారు. వారి చర్య చట్ట విరుద్ధమని నిందించారు. ఒడిశా అమలా సంఘ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆవిధమైన సమావేశం నిర్వహించమని ఏ జిల్లా అమలా సంఘాన్ని ఆదేశించాలని కోరలేదని శశిభూషణ దాస్ వెల్లడించారు. అయితే రెవెన్యూ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఒడిశా అమలా సంఘ బేనరు, లెటర్ పేడ్, పేరును అక్రమంగా వాడుకొని ఒడిశా అమలా సంఘాన్ని తప్పుగా నిలబెట్టేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఈ విషయం తాము కొరాపుట్ జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అక్రమ చర్యకు పాల్పడిన రెవెన్యూ అమలా సంఘ్ ఆఫీసు బేరర్సు మనోజ్ కుమార్ బారిక్, నిత్యానంద బ్రహ్మలపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి సంజయ కుమార్ పండ, సీనియర్ సభ్యులు వై.శ్రీనివాసరావు, కైలాష చంద్ర సామంతరాయ్, జగన్నాథ్‌దాస్ ఉన్నారు.

బొరిగుమ్మలో ఘనంగా నందోత్సవాలు



నందోత్సవ అలంకరణ

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మలో నందోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సాధారణంగా కృష్ణాష్టమి మరుసటి దినాన గోపాలకుల దినం లేక నందోత్సవంగా పాటిస్తారు. ఈ ఉత్సవాన్ని బొరిగుమ్మలో అనాదిగా వంశ పారంపర్యంగా నిర్వహిస్తున్నారు. పురాతన వైష్ణవ సంప్రదాయ వై.కృష్ణ స్వామి కుటుంబం, బొరిగుమ్మ నవరంగపూర్ రోడ్డులోని కృష్ణ స్వామి నివాసంలో అంగ రంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించిన నందోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొని శ్రీకృష్ణునికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా భజన సంకీర్తనలు నిర్వహించారు.

వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: తెప్పలవలస పంచాయతీ పరిధి సీతారాంపురం గ్రామానికి చెందిన మాలుగు రమణ (44) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమణ ఈనెల 15వ తేదీన చీమలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువతీ యువకుల దుర్మరణం

పీఎం పాలెం: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో యువతీ యువకులు దుర్మరణం చెందారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా హైవేపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. నగర పరిధిలోని జోడుగుళ్లపాలేనికి చెందిన వాసుపల్లి దాసుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వాసుపల్లి సతీష్(19) భవన నిర్మాణ సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. అప్పుడప్పుడు చేపలుప్పాడలో ఉంటున్న తాతగారి ఇంటికి వెళుతుంటాడు. పలాసకు చెందిన ఉష(18)తో యువకుడికి పరిచయం ఉంది. తనను కలుసుకోవడానికి వచ్చిన ఆమెతో డ్యూక్ బైక్‌పై బయటకు వెళ్లాడు. తాతగారి ఇంటి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు వీరిద్దరూ పరదేశిపాలెం మీదుగా బయల్దేరారు. చంద్రంపాలెం హైస్కూల్ ఎదురుగా హైవేపైకి వచ్చేసరికి ముందు వెళ్తున్న బస్సు, లారీలను తప్పించబోయి లారీకి బైక్ తగలడంతో కింద పడిపోయారు. ఇద్దరికీ తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలంలోనే మరణించారు. మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రాము తెలిపారు.

సెంచూరియన్ వర్సిటీలో జాతీయస్థాయి సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న వివిధ వర్సిటీల ప్రతినిధులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో జాతీయ సాంకేతిక విద్యావ్యవస్థ (ఎన్ఐటీ) సహకారంతో 'నెక్ట్స్ జనరేషన్ వైర్‌లెస్ కమ్యూనికేషన్-ఎనర్జీ హార్‌వెస్టింగ్ టెక్నాలజీ'పై జాతీయ స్థాయి అధ్యాపక శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను ఎన్ఐటీ (పాట్నా) డైరెక్టర్ ప్రొఫెసర్ పి.కె.జైన్, సెంచూరియన్ వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్‌లు ప్రారంభించారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్, అధ్యాపకులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో 5జీ, 6జీ సిస్టం, ఎల్ఓటీ, ఆర్ఎఫ్, ఎనర్జి హార్‌వెస్టింగ్, స్మార్ట్ కమ్యూనికేషన్‌పై విస్తృతంగా చర్చించారు. శిక్షణ తరగతులు ఈ నెల 29వ తేదీ వరకూ జరుగుతాయని డీన్ (కంప్యూటర్ సైన్సు) ప్రఫుల్ల పట్నాయక్ తెలియజేశారు.

ఆదిత్యుని సన్నిధిలో న్యాయమూర్తి తుహిన్ కుమార్



జస్టిస్ తుహిన్‌కుమార్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్ సతీసమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవంగా పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలను చేయించి, ఆలయ విశిష్టతను శంకరశర్మ వివరించారు. అనంతరం అనివెట్టి మండపంలో వేదాశీర్వచనాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. వారితో పాటు జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి హరిబాబు, ఆర్డీవో సాయి ప్రత్యూష తదితరులు ఉన్నారు

- పొందూరు ఏఎఫ్‌కేకేకు సువర్ణావకాశం
- శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేవీఐసీ సుముఖం
- అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ

పొందూరు ఖాదీ... శిక్షణతో ఖ్యాతి..!



పొందూరు ఖాదీ వస్త్రాలు



ఏఎంసీ, ఎన్‌ఎంసీ దారాలు తయారు చేసే వ్యవస్థ

పొందూరు: వేసవిలో చల్లదనం.. శీతాకాలంలో వెచ్చదనం ఇవ్వడం పొందూరు ఖాదీ వస్త్రాల ప్రత్యేకత. ఈ దుస్తులు ఎంతో సౌకర్యవంతంగా, హుందాగా ఉంటాయి. అతి సామాన్యుల నుంచి ఉన్నతవర్గాల వరకూ ప్రతి ఒక్కరూ ధరించేందుకు వీలుగా అందుబాటు ధరల్లో లభిస్తాయి. మహాత్మా గాంధీ నుంచి ప్రస్తుత రాజకీయ నాయకుల వరకు ఎంతోమంది పొందూరు ఖాదీకి అభిమానులు ఉన్నారు. ఈ ఫైన్ ఖాదీ(సన్నఖాదీ) తయారీకి ప్రత్యేకంగా శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే పండించే కొండ పత్తిని ఇక్కడ ఉపయోగిస్తారు. దశాబ్దాల కాలం నుంచి పొందూరు ఏఎఫ్‌కేకే సంఘం అనేది ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ కమిషన్(కేవీఐసీ) ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంఘాన్ని కేవీఐసీ సౌత్‌జోన్ డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్ రెడ్డి ఇటీవల సందర్శించారు. దీనిలో భాగంగా సంప్రదాయ ఖాదీ వస్త్రాల తయారీ కేంద్రం మరిన్ని కాలాలు విరజిల్లాలని ఆకాంక్షిస్తూ తన పరిధిలో హామీలనిచ్చారు. ఖాదీ ప్రమోషనల్ గ్రాంట్ నుంచి అవసరమైన పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. వర్క్‌షెడ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నామని, పొందూరు ఏఎఫ్‌కేకే సంఘంతో కేవీఐసీ కలిసి కొత్తగా నైపుణ్యాలపై శిక్షణా కేంద్రం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కేవీఐసీ, జీఎంఆర్ సంయుక్తంగా విలేజ్ ఇండస్ట్రీస్ కింద శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. ఖాదీని ముందు తరాలకు అందించేందుకు ఆ అవకాశాన్ని పొందూరు ఏఎఫ్‌కేకే సంఘం దక్కించుకోవాలని సూచించారు.

శిక్షణతో ఉపాధి

చేనేత వస్త్ర తయారీలో శిక్షణ ఇవ్వడం వలన నిరుద్యోగులకు ఉపాధి చేకూరుతుంది. నెలకు దాదాపు రూ.15 వేలు నుంచి రూ.25 వేలు వరకు సంపాదించుకునే అవకాశం ఉంటుంది. స్పిన్నింగ్, వీవింగ్‌లో శిక్షణ పొందిన వారంతా సంఘాలకు, సొసైటీలకు దుస్తులు నేస్తూ ఉపాధి పొందుతారు. వాస్తవానికి స్పిన్నర్లు, వీవర్లు, సంఘం ఉద్యోగులకు ఆదాయం పెంచుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. కేవీఐసీ ఎండీఏ సిస్టంలో ఉత్పత్తిపై 35 శాతం మొత్తాన్ని ప్రతీ మూడు నెలలకు ఒకసారి స్పిన్నర్లు, వీవర్లు, ఉద్యోగులకు అందిస్తుంది. ఇదేకాకుండా సంఘాలు మజూరీని అందజేస్తున్నాయి. కొత్త కార్మికులు సంఘంలో చేరి దుస్తులు నేస్తే మరింత ఆదాయం పొందే అవకాశం మెండుగా ఉంది.

సొసైటీలకు సహకారం అందాలి

అయితే వాస్తవానికి సొసైటీలు, సంఘాలకు దుస్తులు నేసే వారికంటే మాస్టర్ వీవర్స్ దగ్గర ఎక్కువ కార్మికులు ఉండడం గమనార్హం. మాస్టర్ వీవర్స్ నేసే వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉంది. సొసైటీలు, సంఘాలకు నేసేవారికి ప్రభుత్వ సహకారం అందించాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి. ఉచిత విద్యుత్, ఆరోగ్య బీమా, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటివి సొసైటీలు, సంఘాలకు నేసే కార్మికులకు వర్తింపజేయాలి. దుస్తులు నేసే వారికి షరతులు ఉండకూడదు. ఉదాహరణకు పొందూరు ఏఎఫ్‌కేకే సంఘంలో ఏఎంసీ, ఎన్ఎంసీ వస్త్రాలు మాత్రమే లభిస్తున్నాయి. సీమనూలుతో నేసే వస్త్రాల తయారీ ఇక్కడ లేదు. అందువలన ఏరకమైన నూలుతోనైనా వస్త్రాలు తయారు చేయొచ్చన్న అనుమతి కేవీఐసీ నుంచి రావాలి. తద్వారా ఉత్పత్తి పెరుగుతుంది. కార్మికులకు ఆదాయం పెరుగుతుంది. కొత్తవారు ఈ రంగంలోకి వచ్చేందుకు మొగ్గు చూపుతారు.

సమయం ఆసన్నమైంది



పొందూరు ఏఎఫ్‌కేకే సంఘం

అంతరించిపోతున్న ప్రాచీన, సంప్రదాయ వస్త్ర తయారీ ప్రక్రియను బతికించేందుకు ఏఎఫ్‌కేకే సంఘం వడుకు, నేత ప్రక్రియలను నేర్పే శిక్షణా సంస్థగా అవతరించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఆ మేరకు ఏఎఫ్‌కేకే సంఘం త్వరగా కేవీఐసీ సాయంతో శిక్షణలు ఇచ్చేందుకు భాగస్వామ్యం కోసం అడుగులు వేయాలి. పొందూరులో గతంలో 1,200 మంది స్పిన్నర్లు ఉండేవారు. ప్రస్తుతం వారి సంఖ్య 520 మందికి చేరింది. గతంలో 300 మంది నేత కార్మికులు ఉండేవారు. ప్రస్తుతం కేవలం 80 కుటుంబాలు మాత్రమే నేత కార్మికులుగా మిగిలారు. ఏళ్లు గడుస్తున్న కొద్దీ కార్మికులు తగ్గిపోతున్న నేపథ్యంలో కొత్తవారు ఈ రంగంలోకి రావాల్సిన అవసరం ఏర్పడింది. దీని కోసం శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

శిక్షణ ఇచ్చేందుకు సిద్ధం



కేవీఐసీ డిప్యూటీ సీఈవో మదన్‌మోహన్‌రెడ్డి పొందూరు ఏఎఫ్‌కేకే సంఘాన్ని సందర్శించి హామీలివ్వడం వాస్తవమే. కొత్తవారికి వడుకు, నేత ప్రక్రియలపై శిక్షణలు ఇచ్చేందుకు కేవీఐసీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణలిచ్చేందుకు ఏఎఫ్‌కేకే సంఘం సిద్ధంగా ఉంది.

– దండా వెంకటరమణ, సెక్రటరీ, ఏఎఫ్‌కేకే సంఘం, పొందూరు

అనుమతులిస్తాం

ఖాదీ వస్త్రాలు తయారు చేసేందుకు పొందూరు ఏఎఫ్‌కేకే సంఘాన్ని కేవీఐసీతో ట్రైనింగ్ పార్టనర్‌గా ఉండమని సూచించాం. పొందూరు ఖాదీని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనివలన కొత్తతరం వారు ఈ వృత్తిలో కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. కొత్తగా వడుకు, నేత ప్రక్రియలో శిక్షణ ఇచ్చేందుకు పొందూరు ఖాదీ సంస్థకు దరఖాస్తు చేయమని చెప్పాను. శిక్షణ ముగించుకున్న వారికి సర్టిఫికెట్లు సైతం అందజేస్తాం. ఏ జిల్లా నుంచైనా శిక్షణలకు పొందూరుకు రావచ్చు. వడుకు, నేత పని నేర్చుకోవచ్చు.

– మదన్‌కుమార్ రెడ్డి, డిప్యూటీ సీఈవో, బెంగుళూరు, కేవీఐసీ

ఈసీ తీరు బాధాకరం

- కొవ్వొత్తులతో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: దేశంలో రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ఎలక్షన్ కమిషన్, కేంద్రంలో బీజేపీకి అనుకూలంగా పనిచేస్తుండడం బాధాకరమని, ప్రజాస్వామ్యాన్ని పాతరేసేలా పనిచేస్తున్న ఎన్నికల కమిషన్ తీరును దేశ పౌరులంతా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదం వెంకట త్రినాథరావు, అంబటి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా విజ్ఞాన్ భవన్ నుంచి మున్సిపల్ ఆఫీస్ గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా పౌరులకు సంక్రమించిన ఓటుహక్కును కేంద్రంలో ఉన్న బీజేపీ దొంగలించి దొడ్డిదారిలో అధికారం చేపట్టడం శోచనీయమన్నారు.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని రాజకీయ స్వలాభం కోసం కేంద్ర ప్రభుత్వం వాడుకుంటోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సైదుల్లాఖాన్, అంబటి లక్ష్మణరావు, తెంబూరు మధుసూదనరావు, అంబటి దాలినాయుడు, చాన్ భాష, మామిడి సత్యనారాయణ, ఆబోతుల వెంకట నాయుడు, బొచ్చ వెంకటరమణ, ఆదినారాయణ, బగ్గ రాము, సురియా బేగం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెళ్లి ముచ్చట తీరకుండానే..!

• రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అప్పారావు మృతదేహం

రామభద్రపురం: పెళ్లయిన మద్దుముచ్చట తీరకుండానే రెండు నెలలకే రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ విషాదకర సంఘటన సోమవారం రామభద్రపురం మండలంలోని శిష్టుసీతారాంపురం రహదారిపై జరిగింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శిష్టుసీతారంపురం గ్రామానికి చెందిన వెన్నెల అప్పారావు(31) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై రామభద్రపురం మండలకేంద్రానికి వెళ్లాడు. పనిముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లిపోతుండగా అధికంగా వర్షం కురవడం వల్ల ద్విచక్రవాహనం అదుపు తప్పి సీతారాంపురం గ్రామం రూట్‌లో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి అక్కడికక్కడే దుర్మణం చెందాడు. వెంటనే స్థానికులు మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య ప్రశాంతికుమారి, కుటుంబ సభ్యులు భోరున విలపించారు.పెళ్లయి రెండు నెలలే అయిందని, ముద్దు, ముచ్చట తీరకుండా వెళ్లిపోయావా? అంటూ వారి రోదన చూసిన ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టారు. మృతుడి భార్య ఫిర్యాదుమేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ఏరియా ఆస్పత్రి కిటకిట


ఏరియా ఆస్పత్రిలో ఓపీ వద్ద రోగులు

సీతంపేట: విస్తృతంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు కూడా విస్తరిస్తున్నాయి. స్థానిక ఏరియా ఆస్పత్రి సోమవారం రోగులతో కిటకిట లాడింది. జ్వరంతో పాటు వివిధ రోగాల బారిన పడిన వారు ఆస్పత్రికి వస్తున్నారు. మొత్తం ఓపీ 345 మంది రాగా వారిలో జ్వరాలతో బాధపడుతున్న వారు 71 మంది ఉన్నారు. ఇన్‌పేషెంట్లుగా 71 మంది చేరారు. వారందరికీ రక్తపరీక్షలు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరెంటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


ఎర్నాయుడు మృతదేహం

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన బోదంకి ఎర్నాయుడు (50) గ్రామంలోని వీర సాగరం చెరువులో పడి మృతిచెందాడు. ఎర్నాయుడు పశువులు మేపుతున్న సమయంలో అవి చెరువులోకి దిగడంతో వాటిని తోలేందుకు చెరువు మధ్యలోకి వెళ్లి మునిగిపోయాడు. ఎర్నాయుడు చెరువులో దిగి ఎంత సేపటికీ రాకపోవడంతో స్థానికులు చెరువులో దిగి వెతికి బయటకు తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి పోలీసులు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

డెంకాడ: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల డబ్బులు రాని రైతులు ఈ నెల 20వ తేదీలోగా గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి టి.సంగీత తెలిపారు. ఆయా పథకాల నగదు పడని అన్నదాతలంతా దరఖాస్తు చేసుకున్న అనంతరం 1బి, ఆధార్, ఫోన్ నంబర్ వెంట తీసుకుని దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి ఇవ్వాలన్నారు.

నెల్లిమర్ల: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి, డబ్బులు పడని వారెవరైనా ఉంటే వారు గ్రీవెన్స్‌లో ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని మండల ఏవో శ్రీలక్ష్మి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. రైతులు తమ అర్హత స్థితిని సంబంధిత పోర్టల్, రైతు మిత్ర యాప్‌లో చూసుకోవాలని, ఆధార్, 1బి, బ్యాంక్ అకౌంట్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్‌ను గ్రీవెన్స్‌కు పట్టకుని వెళ్లి, ఫిర్యాదు చేస్తే డబ్బులు పడతాయన్నారు.

పూసపాటిరేగ: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ డబ్బులు పడని వారంతా ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏవో కె.నీలిమ ఓ ప్రకటనలో సోమవారం కోరారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం: జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ఉధృతి ఎక్కువగా ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఆయన ఏయే ప్రాంతాల్లో వరదనీరు ఉందో.. అక్కడి ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురవుతున్నారో పరిశీలించారు. రోడ్లపై వర్షపునీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఆ చర్యలను యుద్ధప్రాతిపదికన చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ట్యాంక్‌బండ్ రోడ్డు వద్ద పెద్దచెరువు అవుట్ ఫ్లో ప్రాంతానికి వెళ్లిన ఆయన..అక్కడి ప్రధాన కాలువలోకి భారీగా వచ్చి చేరిన గుర్రపు డెక్కను జేసీబీతో తొలగించేయించి, నీటి ప్రవాహానికి అడ్డు తొలగించారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూసుకోవాలని కోరారు. వర్షాల వల్ల ఎవరైనా ఇబ్బంది పడితే నగరపాలక సంస్థ కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్ 98499 06486ను సంప్రదించి, సాయం పొందవచ్చన్నారు.

ముగ్గురు అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

• సెలవు అనుమతి లేకుండా జిల్లా దాటివెళ్తే చర్యలు
• ప్రజల అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలి


అర్జీదారుల సమస్యలను వింటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్


ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం అర్బన్: సెలవు అనుమతి లేకుండా జిల్లా దాటి వెళ్లే జిల్లా అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అధికారులను హెచ్చరించారు. సెలవు మంజూరు చేయకుండా సంక్షేమ శాఖ అధికారిణి పీజీఆర్ఎస్‌కు గైర్హాజరు అవడంపై సీరియస్ అయ్యారు. అదే విధంగా సమయపాలన పాటించకుండా పీజీఆర్ఎస్‌కు ఆలస్యంగా హాజరైన డీఎంహెచ్ఓ జీవనరాణిపై కలెక్టర్ ఆగ్రహించారు. బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వహించిన కారణంగా మరో అధికారి ఐసీడీఎస్ పీడీ విమలారాణిపై సీరియస్ అయి సరెండర్ ఉత్తర్వులు ఇవ్వమని డీఆర్ఓను ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అంగన్‌వాడీ పిల్లలకు సోమవారం సెలవు ఇవ్వాలని ఆదివారం రాత్రి కలెక్టర్ స్వయంగా ఇచ్చిన సెల్ మెసేజ్‌ను 24 గంటల వరకు ఐసీడీఎస్ పీడీ చూడలేదు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఈ ఆదేశాలు జారీచేశారు.

ప్రజల అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలి

కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్, డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్‌లు వెంకటేశ్వరరావు, ప్రమీలాగాంధీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని అర్జీలపై తీసుకున్న చర్యలను నిర్ణీత గడువులోగా అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 94 అర్జీలు అందజేశారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 27 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎస్పీ 27 ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫిర్యాదుదారుల ముందే వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి అక్కడికక్కడే ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ఏడు రోజుల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను రిపోర్ట్ రూపంలో డీపీఓకు పంపాలని సంబంధిత సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలన్నీ పరిష్కారం కావాలి

• కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం వచ్చిన అర్జీలన్నీ పరిష్కారం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు తేల్చిచెప్పారు. కలెక్టర్‌తో పాటు అర్జీల స్వీకరణలో సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, డీఆర్ఓ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణిలు వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలన్నింటినీ పరిష్కారం చూపాలని, ఎక్కడా పెండింగ్ లేకుండా చేసి అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలన్నారు. సోమవారం మొత్తం 65 వినతులు పలు సమస్యలపై అర్జీదారులు అందజేశారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు తగ్గిన వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వినతులు తగ్గాయి. ప్రతి సోమవారం 20కు తగ్గకుండా వచ్చే వినతులు ఈ వారం పదిమాత్రమే వచ్చాయి. భారీగా వర్షాలు కురవడం, ఉభాల సీజన్ కావడంతో వినతులు తగ్గాయని అధికారులు తెలియజేస్తున్నారు. ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు వినతులు స్వీకరించారు. టిటుకుపాయికి చెందిన నిమ్మక చిరంజీవితో పాటు పలువురు గ్రామస్తులు కొండచీపుళ్లు కొనుగోలు చేసి, విక్రయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని పాలిష్‌కోటకు చెందిన భవాని కోరగా లాడకు చెందిన సుక్కయ్య వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని అర్జీ అందజేశాడు. పాతరేగులగూడకు చెందిన సుక్కమ్మ పవర్ వీడర్ ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో పలువురు ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో రూ.22లక్షలు మాయం

విజయనగరం క్రైమ్: ఆన్‌లైన్‌లో లక్షల సొమ్ము పోగొట్టుకున్నానంటూ విజయనగరంలోని బొండాడ వీధికి చెందిన మోహన్‌సాయి వన్ టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఆర్‌వీఆర్‌కె.చౌదరి ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..టెలిగ్రామ్ యాప్ ద్వారా మోహన్‌సాయి బ్యాంక్ ఆఫ్ బరోడాకు రూ.5లక్షలు జమ చేశాడు. నెలలు కావస్తున్నా వడ్డీ పెరుగుతోంది కానీ సొమ్ము తిరిగి రావడం లేదు. జూన్ నెలలో రమారమి రూ.3లక్షలు ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ యాప్ ద్వారా డబ్బులు డిపాజిట్ చేశాడు. ఆ తరువాత మరో రూ.15లక్షలు వివిధ ఖాతాల్లో ఆన్‌లైన్ ద్వారా ట్రేడింగ్ బిజినెస్ చేపట్టాడు. నెలలు కావస్తున్నా డబ్బు తిరిగి రాకపోగా, కనీసం ఆన్‌లైన్‌లో రెస్పాన్స్ కూడా లేకపోవడంతో ఇక లాభం లేదని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. సుమారు రూ.22లక్షలు మోహన్‌సాయి పొగొట్టుకున్నాడని ఫిర్యాదు రావడంతో ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని సీఐ చౌదరి తెలిపారు. విచారణలో భాగంగా ఆయా బ్యాంకులకు లెటర్ రాసి డబ్బులు ఎక్కడి వెళ్లాయి? ఎవరి ద్వారా వెళ్లాయన్న వివరాలు రాబడుతున్నామన్నారు. బ్యాంకులో డబ్బులు ఉంటే కచ్చితంగా తెప్పించగలమని డబ్బు లేకపోతే ఏమీ చేయలేమని న్యాయపరంగా ఫిర్యాదుదారుకు డబ్బులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం


కుక్కకరిచిన గాయాన్ని చూపిస్తున్న బూరాడ సునీల్


కుక్కదాడికి గురైన బాలుడు శివశంకర్

సంతకవిటి: మండలంలోని మోదుగులపేట గ్రామంలో పిచ్చికుక్క సోమవారం స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన లావేటి నారాయణరావు, ముదిలి పారన్నాయుడు, బూరాడ సునీల్, తాడివలస శివశంఖర్‌పై దాడిచేసి కరిచింది. గ్రామస్తులు అప్రమత్తమై కుక్కను ఊరినుంచి తరిమివేయడంతో ప్రమాదం తప్పింది. బాధితులు సంతకవిటి పీహెచ్‌సి, రాజాం ఏరియా ఆస్పత్రులకు వెళ్లి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు వేయించుకున్నారు.

పాముకాటుతో అస్వస్థత

సీతంపేట: మండలంలోని పాతపనుకువలసకు చెందిన కుండంగి బలరామ్ ఆదివారం రాత్రి పడుకున్న సమయంలో విషసర్పం కాటువేసింది. దీంతో అస్వస్థతకు గురవగా స్థానిక ఏరియా ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

యువతిని మోసం చేసిన ముద్దాయికి ఏడాది జైలుశిక్ష


డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: రెండేళ్ల క్రితం ఒక బాలికను నమ్మించి మోసం చేసిన కేసులో ముద్దాయికి విజయనగరం విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి. కె.నాగమణి ఏడాది జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చినట్లు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ గోవిందరావు తెలిపారు. నగరంలోని కొత్తపేటకు చెందిన దశమంతుల లక్ష్మణరావు అనే వ్యక్తి 2023లో ఒక మైనర్‌ను నమ్మించి పెళ్లి చేసుకుంటానని చెప్పి, అనంతరం లైంగిక దాడికి పాల్పడ్డాడు. అప్పట్లోనే మహిళా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా ఎస్సై లక్ష్మి కేసు నమోదు చేశారు. ఆ కేసులో అప్పటి డీఎస్పీ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి అభియోగ పత్రాలను దాఖలు చేశారు. ఈ కేసులో ప్రస్తుత మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ గోవిందరావు సాక్షులను, ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావడంతో స్పెషల్ ఫర్ పోక్సో కోర్టు నాగమణి ముద్దాయి దశమంతుల లక్ష్మణరావుకు పై విధంగా శిక్ష విధించారని డీఎస్పీ తెలిపారు. అయితే ఈకేసులో బాధితురాలికి రూ.20 వేలు పరిహారంగా ఇవ్వాలంటూ కోర్టు తుది తీర్పు ఇచ్చిందన్నారు.

వీరఘట్టంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

• లైసెన్స్ లేని 10 షాపులకు నోటీసులు



వీరఘట్టంలోని ఓ షాపులో తనిఖీలు చేస్తున్న జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి వినోద్‌కుమార్ నాయక్

సాక్షి ఎఫెక్ట్...



సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: ఇటీవల పలు దుకాణాల్లో నాసిరకమైన చిరుతిళ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, కాలం చెల్లిన స్నాక్స్ తిని చిన్నారులు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని సోమవారం సాక్షి లో ప్రచురితమైన 'డేంజర్ స్నాక్స్' కథనంపై జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు స్పందించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి ఎం.వినోద్‌కుమార్ నాయక్ వీరఘట్టంలోని పలు షాపుల్లో సోమవారం ముమ్మర తనిఖీలు చేశారు. ఓ వైపు జోరు వాన కురుస్తున్నా మరో వైపు షాపుల్లో ఉన్న తినుబండారాల ప్యాకెట్లు పరిశీలించారు.మొత్తం పది షాపుల్లో తనిఖీలు చేయగా అన్ని షాపుల్లో కూడా ఎక్కడా తినుబండారాల ప్యాకెట్లపై తయారీ తేదీ గాని, ఎక్స్‌పైరీ డేట్ గాని లేకపోవడాన్ని గుర్తించారు.ఈ షాపులన్నింటికీ ఆయన నోటీసులు ఇచ్చారు.కాలం చెల్లిన తినుబండారాల ప్యాకెట్లను సీజ్ చేశారు. అయితే ఊరిలోకి ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు వచ్చారని తెలియడంతో చాలా షాపులు మూసి వేయడంపై ఆయన షాపుల యజమానుల తీరుపై మండిపడ్డారు.ఆహార పదార్థాలు విక్రయించే ప్రతి షాపు లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.ఇక మీదట ప్రతి వారం వీరఘట్టంలో ఉన్న అన్ని షాపులు తనిఖీ చేస్తానని ఆయన తెలిపారు.వ్యాపారులు సహకరించాలని, నిబంధనలు పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

భారీ వర్షాలపై అప్రమత్తం

• ఎంపీ తనూజారాణి


గుమ్మ తనూజా రాణి, అరుకు ఎంపీ

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లాలో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి ఒక ప్రకటనలో కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి ఏజెన్సీతో కలిగి ఉన్న ప్రాంతంలో ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించి చేపట్టవలసి చర్యలు వివరించామని పేర్కొన్నారు. ప్రధానంగా నదీతీర గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రతి మండలంలోను కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతుల పంటలకు, పశు సంపదకు నష్టం కలగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం ఉందని ఈ పరిస్థితుల్లో ముందుగానే వాటిని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర సమయంలో కలెక్టర్ కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 08963293046కు సంప్రదించాలని స్పష్టం చేశారు.

తీరంలో అప్రమత్తం

• నాలుగు రోజులుగా నిలిచిన చేపల వేట
• మత్స్యకార గ్రామాలను సందర్శించిన అధికారులు


తిప్పలవలసలో మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ రమణ



కోనాడలో చంపావతి సెలయేరు వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: తీరప్రాంత గ్రామాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. గడిచిన నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వలలు, బోట్లు సురక్షిత ప్రాంతాలకు తరలించి మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు తీరంలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసి సురక్షితంగా ఉండాలని కోరారు. ఎంపీడీఓ ఎం.రాధిక కోనాడ గ్రామంలో పర్యటించారు. కోనాడ సెలయేరు వద్ద చంపావతినది నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చింతపల్లి, తిప్పలవలస గ్రామాల్లో తహసీల్దార్ ఎన్‌వీ రమణ పర్యటించి మత్స్యకారులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

'లీప్' యాప్ ప్రామాణికంగా..

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

• ఈనెల 21 నుంచి 23 లోపు గుర్తింపు
• 25న జాబితా ప్రకటన
• రాష్ట్రస్థాయికి ఒక్కో జిల్లా నుంచి 8 మంది ఎంపిక
• ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
• ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదంటున్న ఉపాధ్యాయ సంఘాలు
• విశిష్ట సేవలు అందిస్తున్న టీచర్లను పారదర్శకంగా గుర్తించాలని డిమాండ్



వీరఘట్టం: ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారు చేసిన సేవలకు గాను మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉపాధ్యాయులను ప్రభుత్వాలు ప్రతి ఏటా సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా సత్కరిస్తుంటాయి. ఈ ఏడాది కూడా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఉత్తమ టీచర్ల ఎంపికకు 'లీప్' యాప్‌ను ప్రామాణికంగా చేస్తూ తీసుకువచ్చిన నూతన విధానాన్ని టీచర్లతో పాటు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

లీప్ యాప్ ప్రాధాన్యతపై గుర్రు..

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో ప్రస్తుతం లీప్ యాప్ ఎంతో కీలకం. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, విద్యార్థుల పురోగతి పర్యవేక్షణ, తల్లిదండ్రులతో సమావేశాలు, విద్యార్థుల వ్యక్తిగత సంరక్షణ, విద్యార్థుల గ్రీన్ పాస్‌పోర్టు తదితర కార్యక్రమాలన్నీ ఈ యాప్ ద్వారానే నిర్వహిస్తున్నారు. పాఠశాలలో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన టీచర్ లేదా..విద్యార్థులతోనైనా ఈ పనులు చేయిస్తుంటారు. అలాంటప్పుడు 'లీప్' యాప్ నిర్వహణను ప్రామాణికంగా తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు,టీచర్లు గుర్రుగా ఉన్నారు.

వారంతా బెస్ట్ టీచర్లా?

ప్రతి రోజు స్కూల్ వేళకు వచ్చి ఆన్‌లైన్‌లో అటెండెన్స్ వేసిన ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.అయితే కొందరు టీచర్లు ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు వెళ్లి సాయంత్రం 5 గంటల వరకు ఉండి చదువే చెప్పకుండా యాప్‌లో మాత్రం కచ్చితంగా అటెండెన్స్ వేసే వారు అక్కడక్కడా ఉన్నారు. ఇంకొందరు పాఠశాలకు ఉదయం వెళ్లి యాప్‌లో అటెండెన్స్ వేసి బయటకు వెళ్లి సాయంత్రం 5 గంటలకు మళ్లీ వెళ్లి 'ఔట్' అటెండెన్స్ వేస్తున్నారు. ఇలాంటి వారు బెస్ట్ టీచర్లు ఎలా అవుతారని ప్రశ్నిస్తున్నారు. లీప్ యాప్ ప్రామాణికంగా తీసుకుని రాష్ట్రస్థాయి సాంకేతిక నిపుణులు ప్రతి జిల్లాకు 16 మంది టీచర్లను ఎంపిక చేసి వారి జాబితాలను పంపినట్లు సమాచారం. వారందరినీ జిల్లాస్థాయి అవార్డుకు ఎంపిక చేసేలా ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. లీప్ యాప్ ప్రామాణికంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయాలనే నిర్ణయం సరికాదని, ఈ విషయంలో అధికారులు పునరాలోచించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఎనిమిది కేడర్లలో ఉపాధ్యాయుల ఎంపిక

గురుపూజోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రాష్ట్రస్థాయిలో అందజేసే అవార్డులకు ఒక్కో జిల్లా నుంచి మూడు కేడర్లలో 8 మంది టీచర్లను ఎంపిక చేసి పంపాలంటూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీల కేడర్లలో ఇద్దరు చొప్పున, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో నలుగురిని ఎంపిక చేసి పంపాల్సి ఉంది.ఇప్పటికే పలువురు టీచర్లు దరఖాస్తు చేసుకున్నా..రాష్ట్ర అవార్డులకు ఎంపిక చేసేందుకు ప్రభుత్వం విధించిన నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా?అనే అంశాలపై దరఖాస్తులను స్క్రూట్నీ చేస్తున్నారు.ఈ నెల 14 నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇలా వచ్చిన దరఖాస్తులను ఈ నెల 21 నుంచి 23 వరకు రాష్ట్రస్థాయిలో పరిశీలించి ఈనెల 25న రాష్ట్ర కమిటీ తుది జాబితాను ప్రకటిస్తుంది.

ఈ విధానం సరైంది కాదు



లీప్ యాప్ ప్రామాణికంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు టీచర్లను గుర్తిస్తామనడం సరైన విధానం కాదు. గ్రౌండ్ లెవెల్‌లో చాలా మంది ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.అటువంటి వారిని పారదర్శకంగా గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేయాలి.

– మండల మురళి, ఏపీటీఎఫ్, మండలశాఖ అధ్యక్షుడు, వీరఘట్టం

సిఫార్సులు వద్దు



ఏటా గురు పూజోత్సవం రోజు ఉపాధ్యాయులకు ఇచ్చే ఉత్తమ టీచర్ల అవార్డుల ఎంపికకు సిఫార్సులను రద్దు చేయాలి. మండల స్థాయి,జిల్లా స్థాయిలో ఉండే కమిటీలు పాఠశాలల్లో నిబద్ధతతో పనిచేసే వారిని గుర్తించి వారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసి కష్టపడి పనిచేసే టీచర్లకు సముచిత స్థానం కల్పించాలి.

– అన్ను వెంకటరావు, ఎస్సీ,ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వీరఘట్టం

నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ పాఠశాల


రాజాంలోని ప్రభాకర్ పాఠశాలలో తరగతి గదిలోంచి బయటకు వస్తున్న విద్యార్థులు



యాజమాన్యాన్ని మందలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

రాజాం: తుఫాన్ వర్షాలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు కలెక్టర్ సోమవారం సెలవు ప్రకటించారు. రాజాంలోని చీపురుపల్లి రోడ్డులో గల ప్రభాకర్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం మొండిగా వ్యవహరించి, పాఠశాల తెరవడమే కాకుండా తరగతులకు గైర్హాజరైన విద్యార్థులపై చర్యలు ఉంటాయని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం బయటకు తెలియడంతో రాజాం ఎంఈఓ యాగాటి దుర్గారావు పాఠశాలకు సోమవారం చేరుకుని తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థులు ఉండడం చూసి మండిపడ్డారు. యాజమాన్యాన్ని మందలించడంతో పాటు నోటీసులు అందించారు. వెంటనే తరగతి గదుల్లోని విద్యార్థులను సురక్షితంగా వారి ఇళ్లకు పంపించాలని ఆదేశించడంతో పాటు దగ్గరుండి ఇళ్లకు తరలించారు. అనంతరం నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు. మరో ప్రైవేట్ పాఠశాల తెరిచి ఉందని తెలిసి అక్కడికి వెళ్లి తనిఖీచేశామని ఎంఈఓ విలేకరులకు తెలిపారు. అప్పటికే అక్కడి విద్యార్థులు వెళ్లిపోయారన్నారు.

పాపం.. ఎవరో ఈమె..!

• వర్షంలో తడుస్తూ అమాయకంగా రోదిస్తూ
• కారు చీకటిలో మూడు రోజులుగా బొప్పడాం జంక్షన్‌లోనే
• సపర్యలు చేస్తున్న స్థానికులు


బొప్పడాం జంక్షన్‌లో బస్టాప్‌లో ఉన్న వృద్ధురాలు

నెల్లిమర్ల రూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలికి సుమారు 80 ఏళ్ల పైనే ఉంటాయి. మూడు రోజుల క్రితం నెల్లిమర్ల మండలంలోని బొప్పడాం జంక్షన్‌కు వచ్చి..అప్పటి నుంచి అక్కడే ఉన్న బస్టాప్‌లోనే ఒంటరిగా ఉంటోంది. వర్షానికి తడుస్తూ..అమాయకంగా రోదిస్తూ ఏమీ చెప్పలేని దీనావస్థలో ఉంది. స్థానిక విజయగౌరి యువజన సేవా సంఘం అధ్యక్షుడు పిల్లా సుధాకర్‌తో పాటు పలువురు స్థానికులు సదరు వృద్ధురాలిని అక్కున చేర్చుకుని మూడు రోజుల నుంచి భోజన సదుపాయం కల్పిస్తున్నారు. అయినప్పటికీ రాత్రి సమయంలో కారు చీకటిలో ఒంటరిగా బస్టాప్‌లోనే కాలాన్ని వెళ్లదీస్తోంది. స్థానికులు ఆరా తీయగా..తన పేరు శ్రీకాకుళం దుర్గమ్మ అని..భర్త పేరు సత్యం అని చెబుతోంది. పెద్ద కూతురు పేరు గంగమ్మ అని, కుమారుడి పేరు సన్యాసిరావు అని చెబుతోంది. ఊరు పేరు మాత్రం స్పష్టంగా చెప్పలేకపోతోంది. ఒక సారి జామి వద్ద బంధువులు ఉన్నారని..మరో సారి పొందూరు, రాజాం అంటూ చెబుతోందని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల పేర్లు చెబుతున్నప్పటికీ ఊరి పేరు మాత్రం స్పష్టంగా చెప్పలేకపోతోందంటున్నారు. మూడు రోజుల క్రితం విజయనగరం నుంచి బస్సులో బొప్పడాం జంక్షన్‌లో దిగిందని చెబుతున్నారు. బంధువుల ఇంటికి వెళ్లి తప్పిపోయిందా..? లేక మతిస్థిమితం లేక ఇంటి నుంచి వచ్చేసిందా? అనే విషయం తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఆచూకీ తెలిస్తే ఫోన్ 8374273700 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సామాజిక కార్యకర్త సుధాకర్ కోరారు. పోలీసులకు కూడా సమాచారం ఇచ్చామని, ఎవరూ స్పందించకపోతే వృద్ధాశ్రమంలో చేర్పిస్తామని ఆయన తెలిపారు.